అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు



సహస్రవాద మాల అలంకరణలో స్వామి

మన్సూరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ మన్సూరాబాద్ శ్రీ సాయినగర్‌కాలనీలోని దుర్గాదేవి ఆలయంలో కార్తీక మాస పూజలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆలయంలోని అభయాంజనేయుడికి శనివారం ఆలయ కమిటీ చైర్మన్ పోచబోయిన్‌గణేష్‌యాదవ్ ఆధ్వర్యంలో అర్చకులు చల్లా బాలమురళీకృష్ణ శర్మ వేదమంత్రోచ్ఛరణల నడుమ సహస్ర వాద మాల అక్కు పూజలను నిర్వహించారు. స్వామికి తమల పాకులతో పాటు అనేకరకాల పదార్థాలతో అలంకరణలు చేశారు. భక్తులు పండ్లు, సమర్పించి పూజలు గావించారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ చంద్రారెడ్డి, ఇతర అధికారులు

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) చంద్రారెడ్డి సూచించారు. శుక్రవారం సాయంత్రం అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని బండరావిరాల, బాచారం గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఎస్‌సీవో వనజాత, సివిల్ సప్లై డీఎం హరీష్, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డితో కలిసి అదనపు కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. అకస్మాత్తుగా వర్షం కురిస్తే ధాన్యం తడిసిపోకుండా ఎలాంటి చర్యలు చేపట్టారని అధికారులనడిగారు ధాన్యం తడిసిపోకుండా ముందస్తుగానే అక్కడ టాటిపత్రిలను ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా గోనె సంచుల కొరత లేకుండా చూడాలని, సేకరించిన ధాన్యం బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో, ఆర్ఐ, ఏఈవో, జీపీవో పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి ప్రచారంలో పాల్గొన్న బీఆర్ఎస్ మన్సూరాబాద్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి

జూబ్లీహిల్స్ ప్రచారంలో బీఆర్ఎస్ నేతలు

మన్సూరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో మన్సూరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ముమ్మరంగా ప్రచారం చేపట్టారు. జూబ్లీహిల్స్‌లోని వెంగళరావునగర్ డివిజన్‌కు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. బీఆర్ఎస్ మన్సూరాబాద్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి పిలుపు మేరకు యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ నాయకులు, కార్యకర్తలు వెంగళరావునగర్‌కు తరలివెళ్లి పార్టీ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని కోరుతున్నారు. వెంగళరావునగర్‌లో శుక్రవారం రాత్రి బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేపట్టిన ప్రచార ర్యాలీలో వారు పాల్గొన్నారు.



రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి: శ్వేతారెడ్డి

సైదాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డిఅన్నారు. శనివారం న్యూపవన్‌పురి కాలనీ, వాంబే క్వార్టర్స్‌లో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. వర్షాల కారణంగా పాడైన రోడ్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు మధుకర్ రెడ్డి, సుధాకర్ రావు, వెంకటేష్ గౌడ్, సంగమేశ్వర్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



పనులపై సిబ్బందికి సూచనలిస్తున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

నాలా స్లాబు పనుల్లో నాణ్యత పాటించాలి :కొప్పుల

మన్సూరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ ప్రధాన రోడ్డు నుంచి నాగోల్ శ్రీసాయినగర్‌కాలనీ వైపు చేపడుతున్న నాలా స్లాబు పనుల్లో నాణ్యత పాటించాలని మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. శనివారం నాలాలో హైడ్రా సిబ్బంది చేపట్టిన పూడికతీత పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాలా స్లాబు సరిగ్గాలేక అందులో చెత్తాచెదారం చేరుకోవడంతో వర్షాలు కురిసినప్పుడల్లా మన్సూరాబాద్ ప్రధానరోడ్డుపై వరదనీరు నిలుస్తోందన్నారు. హైడ్రా ఆధ్వర్యంలో నాలాలో పూడికతొలగింపు, స్లాబు పునరుద్ధరణ చేపట్టడంతో వరదనీటి సమస్యతో పాటు రాకపోకలకు సైతం ఇబ్బందులు తొలగుతాయన్నారు.



న్యూ పద్మానగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వంగా మధుసూధన్ రెడ్డి

సీసీ రోడ్డు పనులు పూర్తిచేయాలి: కార్పొరేటర్

చంపాపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ వంగా మదుసూధన్ రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ న్యూ పద్మానగర్ కాలనీలో జీహెచ్ఎంసీ నిధులు రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రహదారి పనుల్లో నాణ్యత లోపించకుండా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని కోరారు. వర్షపునీరు నిలువకుండా రోడ్డు పనులు లేవల్స్ చూడాలని కార్పొరేటర్ కోరారు. డివిజన్‌లోని ఆయా కాలనీలలో ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కరించనున్నామన్నారు. కార్యక్రమంలో జలమండలి వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కాలనీవాసులు మల్లయ్య, హంసరాం తదితరులు పాల్గొన్నారు.

గుర్రంగూడ జంక్షన్.. నిత్యం టెన్షన్!



గుర్రంగూడ జంక్షన్‌ను సిమెంటు దిమ్మెలతో మూసేసిన దృశ్యం



యూటర్న్ వద్ద రాంగ్ రూట్‌లో వస్తున్న వాహనాలు (సర్కిల్‌లో)

- ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం
- మెయిన్ రోడ్డు విస్తరణపై మీనమేషాలు
- యూటర్న్ వద్ద రాంగ్ రూట్ ప్రయాణంతో నిత్యం ప్రమాదాలు

సరూర్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ రహదారిపై బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోకి వచ్చే గుర్రంగూడ జంక్షన్ ప్రమాదాలకు నిలయంగా మారింది. ఇది ట్రై జంక్షన్ కావడం.. జంక్షన్ వద్ద ప్రమాదకర మలుపు కూడా ఉండడంతో వేగంగా దూసుకువచ్చే వాహనాలు రోడ్డు దాటుతున్న పాదచారులను ఢీకొంటున్నాయి. దాంతో పలువురు మృత్యువాత పడుతుండగా అనేక మంది గాయాలతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. బడంగ్‌పేట్ మునిసిపల్ అధికారులు, వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ ఇక్కడ సిగ్నల్స్ ఏర్పాటు అంశాన్ని దాటవేస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.

కౌన్సిల్‌లో తీర్మానం చేసినా చర్యలు లేవు..

గుర్రంగూడ జంక్షన్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుపై ఇక్కడి జీబీఆర్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి వై.శ్రీ భాస్కర్ అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. 2022 ఆగస్టులో ట్విట్టర్ ద్వారా మొదలైన ఆయన పోరాటం.. మాజీ కౌన్సిలర్ గుర్రం సాయికిరణ్‌రెడ్డి సహకారంతో ఫలించి ఎట్టకేలకు సిగ్నల్స్ ఏర్పాటుకు గత పాలకవర్గంలో ఏకగ్రీవ తీర్మానం చేసి ఆమోదించారు. దాంతో ఆయన ఈ విషయాన్ని వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా సిగ్నల్స్ ఏర్పాటుకు అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కల్పిస్తే వెంటనే సిగ్నల్స్ పెడతామని వారు తెలిపారు.

రోడ్డును కొద్దిగా వెడల్పు చేస్తే సరి

ప్రస్తుతం గుర్రంగూడ మెయిన్ రోడ్డు ఫారెస్టు విభాగం భూమిలో నుంచి ఉంది. దీనిని విస్తరించాలంటే ఇప్పట్లో సాధ్యమయ్యే పనికాదు. అయితే రోడ్డు కిరుపక్కలా ఫారెస్టు అధికారులు ఓ వైపు గోడ కట్టుకోగా, మరోవైపు ఇనుప జాలీతో ఫెన్సింగ్ వేశారు. రెండు వైపులా కలిపితే దాదాపు ఏడెనిమిది అడుగుల మేర రోడ్డు పెద్దదిగా మారుతుంది. ప్రస్తుతం అక్కడ పరిసర ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు, విద్యార్థులు, తమ ద్విచక్ర వాహనాలను పార్క్ చేసి వెళ్తున్నారు. దాంతో రోడ్డు అంతా ఇరుకుగా మారుతోంది. ఈ దృష్ట్యా జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినా ఫలితం ఉండదని, రోడ్డును విస్తరిస్తే సరిపోతుందని ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు. అయితే ఈ పని చేయాల్సిన బడంగ్‌పేట్ మునిసిపల్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. వాహనాలను పార్క్ చేయకుండా ఇటీవల అక్కడ 'నో పార్కింగ్' బోర్డులు సైతం ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోతుంది.

యూ టర్న్ వద్ద రాంగ్ రూట్‌లో వాహనాలు

గుర్రంగూడ జంక్షన్‌ను మూసేసిన అధికారులు జంక్షన్‌కు 100 మీటర్ల దూరంలో యూటర్న్ ఏర్పాటు చేశారు. అయితే ఇంజాపూర్, తుర్కయాంజాల్, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు సదరు జంక్షన్ వద్దకు రాంగ్ రూట్‌లో వచ్చి ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇక కొందరు జంక్షన్ సమీపంలో ధ్వంసమైన డివైడర్ పైనుంచి అడ్డదిడ్డంగా రోడ్డు క్రాస్ చేస్తున్నారు. ఇది మరింత ప్రమాదకరంగా మారింది. జంక్షన్‌కు, యూటర్న్‌కు మధ్యలో మలుపు ఉండడంతో వాహనాలు దగ్గరకు వచ్చేదాకా కనిపించడం లేదు. దాంతో పాదచారులు రోడ్డు దాటాలంటే నరకం చవిచూస్తున్నారు.

రోడ్డును విస్తరించి సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి



గుర్రంగూడ మెయిన్ రోడ్డును మునిసిపల్ అధికారులు వాల్ టు వాల్ వెంటనే విస్తరించి మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయాలి. అలా చేస్తే ద్విచక్ర వాహనాల అక్రమ పార్కింగ్‌ను అరికట్టవచ్చు. ఆ వెంటనే సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే పరిస్థితి అదుపులోకి వస్తుంది. రోడ్డు ప్రమాదాలు సైతం తగ్గిపోతాయి. కౌన్సిల్‌లో తీర్మానం చేశారు కాబట్టి వెంటనే అధికారులు ఆ దిశలో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది.

- వై.శ్రీభాస్కర్, గుర్రంగూడ, జీబీఆర్ కాలనీ



ఇరుపక్కలా వాహనాల పార్కింగ్‌తో ఇరుకుగా మారిన గుర్రంగూడ మెయిన్ రోడ్డు

కనుల పండువగా వెంకన్న కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఎల్బీనగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ వెంకటేశ్వరకాలనీలో గల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. వేంకటేశ్వరస్వామి దేవాలయం 41వ బ్రహ్మోత్సవాలలో భాగంగా వేద పండితులు వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. వెంకటేశ్వరకాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణోత్సవంలో హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతి స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భగవన్నామస్మరణతో మార్మోగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. కల్యాణోత్సవంలో ఆలయ చైర్మన్ కొరుపోలు భాస్కర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గండు ధనంరెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

పాపులారిటీ కోసం రీల్స్, స్టంట్స్ చేస్తే కఠిన చర్యలు

- ఆటో నడుపుతూ రొమాన్స్
- వీడియో వైరల్‌పై..స్పందించిన చాదర్‌ఘాట్ పోలీసులు
- ఆటోడ్రైవర్ మైనర్‌గా గుర్తింపు
- పేరెంట్స్‌కు కౌన్సెలింగ్

చాదర్‌ఘాట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పాపులారిటీ కోసం రీల్స్ చేసినా, స్టంట్లు చేసి సోషల్ మీడియాలో పెట్టి నగర ప్రతిష్ట దిగజార్చే విధంగా వికృత చేష్టలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చాదర్‌ఘాట్ పోలీసులు హెచ్చరించారు. ఆటోనడుపుతూ రోమాన్స్ వీడియో శుక్రవారం వెలుగులోకి వచ్చిన ఘటనపై పోలీసులు స్పందించారు. నల్గొండ ఎక్స్‌రోడ్డు నుంచి కోఠి వరకు ఓ యువకుడు ఆటో నడుపుతూ యువతితో రొమాన్స్ చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దాంతో సమాచారం అందుకున్న చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించి ఆటోడ్రైవర్‌ది నల్గొండ జిల్లాగా గుర్తించారు. కాగా అతను మైనర్‌గా తేల్చారు. మైనారిటీ తీరకుండానే ఇలాంటి వికృత చేష్టలకు పాల్పడటంపై తీవ్రంగా మందలించారు. శనివారం అతని తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి ఇతర వాహనదారులకు అసౌకర్యం కలిగేలా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు వార్నింగ్ ఇచ్చారు.

56 మంది మద్యం ప్రియులకు కౌన్సెలింగ్



ప్రయాణికులకు, వాహనదారులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న నర్సింహారావు

కొత్తపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వాహనాలు నడపడం ప్రమాదాలకు దారితీస్తుందని అల్కాపురి చౌరస్తా సమీపంలో గల ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ రాచపూడి, ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి అన్నారు. రాచకొండ కమిషనరేట్‌లోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ వాహనాల తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన వారిలో 56 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శనివారం టీటీఐ లెక్చర్ హాల్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. వారికి మద్యంమత్తు అనర్థాలను గుర్తు చేసే వీడియోలు, ప్రమాదాల క్లిప్పింగ్స్ సందేశాత్మక గీతాలు, ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యుల మాటలనూ ప్రదర్శించారు. తనిఖీలు వాహనదారులు, ఇతరులూ సురక్షితంగా గమ్యాలకు చేరుకునేందుకు నిర్వహిస్తారని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్ఐ నర్సింహారావు అన్నారు. శనివారం ఆయన తమ బృందంలో కలిసి ఎల్బీనగర్ రింగ్ రోడ్డు సమీపంలో, ఇబ్రహీంపట్నం బస్టాపు, హుడా కాలనీ, కొత్తపేట క్రాస్‌రోడ్స్, రంగారెడ్డి జిల్లా పాతకోర్టు కాంప్లెక్స్ వద్ద 345 మంది బస్సుల డ్రైవర్లకు, వాహనదారులకూ నిబంధనలు వివరించారు. అనంతరం నిబంధనల కరపత్రాలు పంపిణీ చేశారు.

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



సీఎం రేవంత్‌రెడ్డి బర్త్ డేను పురస్కరించుకొని కేక్‌కట్ చేస్తున్న టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ తదితరులు



మలక్‌పేటలోని బదిరుల ఆశ్రమ పాఠశాలలో చిన్నారుల మధ్య కేకు కట్ చేస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లక్ష్మి, తదితరులు

చంపాపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): టీపీసీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సీఎం బర్త్ డేను పురస్కరించుకొని మిద్దెల జితేందర్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. రేవంత్‌రెడ్డికి భగవంతుడు చల్లగా చూడాలని కోరారు.



సింగరేణి కాలనీలో కేకు కట్ చేస్తున్న మార్కెట్ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్

చంపాపేట డివిజన్‌లో...

చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో ఆలయ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నల్ల రఘుమారెడ్డి ఆధ్వర్యంలో శ్రీ ధ్యానాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు సీఎం కుటుంబ సభ్యుల గోత్ర నామాలతో సంకల్పం, అర్చన చేశారు.

బదిరుల ఆశ్రమ పాఠశాలలో..

చాదర్‌ఘాట్, ఆంధ్రజ్యోతి: మలక్‌పేటలోని బదిరుల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకొలేకర్ లక్ష్మీ, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్ పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ప్రత్యూష, కిషన్‌సింగ్, షకీల్, డివిజన్ల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్‌గౌడ్, రాహుల్, చక్రపాణి, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.



కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవస్థానంలో పూజలు చేస్తున్న నల్ల రఘుమారెడ్డి

బార్ కౌన్సిల్‌లో అవకతవకలపై దర్యాప్తు చేయించాలి : రాపోలు



సమావేశంలో మాట్లాడుతున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్

చాదర్‌ఘాట్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఆర్థిక వ్యవహారాల్లో జరుగుతున్న అవకతవకలపై రాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలతో దర్యాప్తు చేయించాలని హైకోర్టు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ అన్నారు. శనివారం గడ్డిఅన్నారం కల్యాణ్‌నగర్‌లోని తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ఈమేరకు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన 2014 నాటి నుంచి బార్ కౌన్సిల్‌కు చెందిన కమిటీ ఏకచత్రాధిపత్యంగా కొనసాగుతుందన్నారు. బార్ కౌన్సిల్‌లో న్యాయవాదులుగా నమోదయ్యే న్యాయవాదుల నుంచి అడ్వకేట్ వెల్ఫేర్ ఫండ్ పేరిట ఫీజుల రూపంలో వసూలు చేస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 40వేల మందికి పైగా న్యాయవాదులు తాము వకాలత్ పొందిన కేసులు కోర్టులో వాదించడానికి ప్రతి రోజు అడ్వకేట్ వెల్ఫేర్ టికెట్ల రూపంలో చెల్లించే డబ్బులను బార్ కౌన్సిల్ వసూలు చేస్తుందని వివరించారు. ఈవిధంగా వసూలు చేస్తున్న కోట్లాది రూపాయల్లో కొంత నిధులను న్యాయవాదుల సంక్షేమానికి ఉపయోగించడం లేదని రాపోలు ఆరోపించారు. గడచిన 11 సంవత్సరాలుగా బార్ కౌన్సిల్ ఇలా వసూలు చేసిన ఆదాయం ఎంత వచ్చింది. ఎంత ఖర్చు పెట్టారు. అనే అంశాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వీటిపై న్యాయవాదులకు ఉన్న అనుమానాలు తొలగించాల్సిన బాధ్యత బార్ కౌన్సిల్‌కు ఉందన్నారు. భారీ ఆర్థిక వ్యవహారాల అవకతవకలకు సంబంధించిన ఈవిషయాలపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని సీబీసీఐడీతో దర్యాప్తు చేయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమావేశంలో న్యాయవాదులు ఎస్.కె.రత్నం, జీవన్‌కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



చంపాపేట చౌరస్తాలో రహదారి పక్కన కుప్పలుగా పడివున్న కేబుల్ వైర్లు

ట్రాన్స్‌కో.. జర చూసుకో!

చంపాపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చంపాపేట చౌరస్తాలో నడకదారిలో ప్రమాదకరంగా కేబుల్ వైర్లు పడిఉన్నా పట్టించుకునేవారే కరువయ్యారు. వారం రోజుల కిందట చౌరస్తాలో ట్రాన్స్‌కో అధికారులు కొత్తగా విద్యుత్ స్తంబాలను ఏర్పాటు చేశారు. పాత స్తంబాలకు ఉన్న వివిధ కేబుల్ వైర్లను కత్తిరించడంతో అవి రోడ్డుపై పడ్డాయి. చౌరస్తాలో రహదారి పక్కనుంచి బస్టాప్‌కు వెళ్లే ప్రయాణికులు కేబుల్ వైర్లు కాళ్లకు చుట్టుకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటు ట్రాన్స్‌కో అటు జీహెచ్ఎంసీ శానిటేషన్ సిబ్బంది వైర్లను తొలగించక పోవడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జీహెచ్ఎంసీ, ట్రాన్స్‌కో అధికారులు ప్రమాదకరంగా పడివున్న కేబుల్ వైర్లను అక్కడి నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు కుమ్మరుల కార్తీక వనభోజన మహోత్సవం

మన్సూరాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ పరిధి వనస్థలిపురం సుష్మా చౌరస్తా సమీపంలోని ఎం ఈ రెడ్డి గార్డెన్స్‌లో కుమ్మర శాలివాహనుల కార్తీక వనభోజన మహోత్సవం నేడు(ఆదివారం) నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘం హైదరాబాద్ తూర్పు విభాగం అధ్యక్షుడు తీగుళ్ల యాదగిరి ప్రజాపతి, ప్రధాన కార్యదర్శి ఎలిమినేటి నారాయణ ప్రజాపతి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాలుగేళ్లుగా కుమ్మర శాలివాహన కార్తీక వనభోజన మహోత్సవాన్ని కుల పెద్దలు, ప్రముఖుల సహకారంతో నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. వేడుకలో భాగంగా కుమ్మరుల వివాహ పరిచయవేదిక, కుల పెద్దలు, ప్రముఖులు, మేధావులకు సన్మానం, సాంస్కృతిక, దాండియా వంటి కార్యక్రమాలతో పాటు ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయన్నారు.